PRAMUKHANDHRA

21st Year of Publication

We carry the news and views of Telugus

# ప్రముఖాంధ్ర

₹15


సెప్టెంబర్ 2015

సంపాదకుడు
గోటేటి శ్రీ రామారావు

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA,
GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA



This issue is sponsored by State Bank of India



















# Sree Rayalaseema Alkalies And Allied Chemicals Ltd.,




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

సెప్టెంబర్ 2015

సంపుటి : 21 **248** సంచిక : 8




# అసూయ, ఆవేశం, ఇంగితరాహిత్యం, ఈర్ష్యాద్వేషం ఉన్నతమైన భారత సంస్కృతీ ప్రతిబంధకమవుతూన్నవి!

భారతదేశ భవితవ్యానికి భారతీయులే ప్రతిబంధకులవుతున్నారు.

చలించే మనస్సూ! భ్రమించే దృష్టిని అరికట్టాలనుకున్నప్పుడు, మర్రి ఊడల్లా పెరిగిన ఈర్ష్యాద్వేషాలను పెరికి పారవేయాలి. అంతేదక్క, మొక్క సరిగా పెరగడం లేదని పెరికి ఇంకోచోట, అక్కడనుంచీ పెరికి మరోచోటికీ, అక్కడా సరిగ్గా లేదని మరోచోటా పాతుతూ పోతూంటే మొక్కలోని ధైర్యం సడలుతుంది. హడలుతూ అది ఒడిలిపోతుంది. స్వార్ధంతో కూడుకున్న రాళ్ళతో రాటలు నాటితే, అది నీడనివ్వదు; మీదపడి మరణింప చేస్తుంది.

ఇందుకు దర్పణంగా 'ఇండియా' అనబడు ఈ దేశంలోని ప్రజాస్వామ్యం సౌమ్యత్వాన్ని కోలుపోయింది. అనిత్యమైన వర్గాలు పెరుగుతూన్నాయ్, వైషమ్యాలు పెరుగుతున్నాయి. వాటికి దీటుగ్గా అసూయలు పెరుగుతున్నాయ్.

దేశమును ప్రేమించేవారూ, మంచిని పెంచేవారూ లేరు. 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుష్యులోయ్' అన్న గురితప్పని గురజాడ గేయాన్ని మననం చేయని వారిమధ్య చరజీవుల వలె జీవిస్తున్నాం. స్వాతంత్ర్యం సిద్ధించి 68 సంవత్సరాలైనా మనలోని పరతంత్ర భావాలు పోలేదు, దాస్య జీవనాన్ని మరిచిపోలేదు.

అశాన్తీ ప్రదాతలందరూ శాన్తి నినాదం చేస్తున్నారు. యజ్ఞాలూ, యాగాలు వంటి హోమక్రతువులు చేస్తున్నారు, అంతఃకరణలో సత్యం లేకున్న అవి ఫలించవు అంతరంగం ల్లోంచి ప్రేమ పుట్టుకుని రావాలి. ప్రేమను పొందుతూ పదిమందికీ పంచాలి, పంచే యత్నం చేయాలి.

స్వాతంత్ర్యం సిద్ధించిన ఈ 68 ఏండ్లలోనూ శాన్తి పెరగలేదు. అసూయ, అహంకారం, ద్వేషం, ఈర్ష్య వంటి దుర్గుణాలు పెరిగాయ్. అశాన్తిని రగిలింపచేస్తున్నాయ్.

వ్యక్తి శాన్తిగా ఉన్నప్పుడే కుటుంబం శాన్తిగా ఉంటుంది. కుటుంబాలన్నీ శాన్తిగా ఉంటే, ఊరు శాన్తంగా ఉంటుంది. ఊరులు శాన్తంగా ఉంటే రాష్ట్రం శాన్తంగా ఉంటుంది. రాష్ట్రాలు శాన్తంగా ఉంటే దేశం శాన్తంగా ఉంటుందని, స్వాతంత్రం రానప్పుడనుకునే వాళ్ళం.

దేశానికి ప్రాణతుల్యమైన 'భారతీయత మృగ్యమౌతూ వస్తున్నది. విభిన్న జాతుల సమాహారంగా ఉన్న భారతదేశంలో కలిసికట్టు జీవనాన్ని భారత సంస్కృతి కల్పించింది. వలస వచ్చినవారినీ, వారి సంస్కృతిని కూడా భారతీయులు ఆదరించారు. తమపై దాడి చేసినవారిని సహితమూ సహించి, తమ తోటివారిగా మన్నించారు.

> ప్రజాధనాన్ని మేస్తూ శాసనసభ్యులుగా ఉంటూ, సభను జరగనీయకుండా భంగం చేసేవారినీ, పార్లమెంటు సభ్యులుగా ఉంటూ లోక్‌సభా, రాజ్యసభల్ని జరుగనీయ కుండా 'పోడియం'లోకి పరుగెత్తే వారినీ, ఓటేసిన పౌరులు వెనక్కి పిలిపించే చట్టం రూపొందాలి.
>
> ఇస్లాము దేశాల్లో ఉండే కఠినతర శిక్షలు ఉండాలి!
>
> కానిచో వెర్రివాడి పెళ్ళాం వాడకల్లా వొదిన చందంలా పరిణమిస్తుంది.

## భారతదేశంలో ఇప్పటికీ అనైక్యత కొనసాగుతూనే ఉన్నది

విదేశీయులు పలుమారులు దండెత్తి వచ్చినప్పటికినీ భారతీయులు జాగ్రత్తపడలేక పోయారు. భారతదేశమును భారతీయుల సహాయముతోనే విదేశీయులు తమ వశం చేసుకోగలిగారు.

### మన అనైక్యతే బలహీనత


భారతదేశానికీ ఇంగ్లాండుకూ ఏ విధమైన పోలికలూ లేవు. వైశాల్యం బట్టి చూస్తే ఇంగ్లాండు భారతదేశం కన్నా చిన్నది. జనాభాపరంగా కూడా ఇంగ్లాండు కంటే ఎన్నో రెట్లు అధిక జనాభా గల భారతదేశమును వాళ్ళు వశం చేసుకోవడానికి గల కారణమేఁవిటి? భారతదేశంలో శౌర్య ధైర్య పరాక్రమవంతులు లేకపోలేదు. నాగరికతయందు కానీ, విజ్ఞానమునందు కానీ భారతదేశము ఏ దేశమునకూ తీసిపోదు. కానీ, భారతదేశమునందు ఐకమత్యము లేకపోవుట చేతనే, చిన్న దేశ మైనప్పటికినీ ఇంగ్లాండువారు భారతదేశమును ఓడించడానికి ప్రయత్నించారు.

దేహమునకు గానీ, దేశమునకు గానీ ఐకమత్యం అవసరం. ఐకమత్యమే మహాబలం. అదిలేని బలహీనులను ఎవరైనా జయించగలరు.

అనేక వేల మైళ్ళ దూరము నుండీ వచ్చిన ఆంగ్లేయులు 190 సంవత్సరములు భారతదేశాన్ని వశం చేసుకున్నారు. 1757 సంవత్సరములో ప్రారంభమైన వారి పాలన 1947లో ముగిసింది. (ఎప్పుడో భగవాన్ సత్యసాయిబాబా అన్న మాటలు ఇప్పటికీ ములుకులై గుచ్చుకుంటున్నాయి.

కానీ, ఏ దుష్టగ్రహాల సంపర్కమో, ప్రజాస్వామ్య భారతదేశంలో శాన్తి లేదు. రాజరికాలు పోయినా – ఏక వంశపాలనను ఎవరూ చెరిపివేయలేకుండడం – దోపిడీ చేస్తున్నవారికి దాసోహమనడం, ఏకులా ప్రవేశించినవారుమేకులవడంతో ఈ దేశం హిందూ దేశమూ భారతదేశమూ కాని సెక్యులర్ దేశమంటున్నారు.

శ్రీరాముడు పాలించిన ఈ రామరాజ్యంలో రామునికి స్థానం లేదు. శ్రీకృష్ణుడు బోధించిన 'భగవద్గీత'కు జాతీయ గ్రంథ స్థానం లేదంటున్నారు. అసూయలతో అనైక్యత స్వైరవిహారం చేస్తున్నది.



పురోగమనమో, తిరోగమనమో తెలియని స్థితి నుంచీ బయటపడాలంటే దేశమనెడి దొడ్డ వృక్షం ప్రేమలను పూలెత్తవలెనోయ్ అంటూ అందరూ కలిసి మెలసి ఉండాలి. కల్మషుల్ని తరిమి వెయ్యాలి. గోముఖ వ్యాఘ్రాల్ని హిందూ ద్వేషుల్ని తరిమివేస్తేనేగానీ దేశాభివృద్ధి కలుగదు.


బుధజన విధేయుడు

*– గోటేటి శ్రీరామారావు*


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

## శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

# వేదమే ధర్మానికి మూలం



**నమామి యామినీనాథలేఖాంలంకృతకుస్తలామ్ ।**
**భవానీం భవసన్తాపనిర్వాపణ సుధానదీమ్ ॥**

ధర్మం గురించి తెలుసుకొనటానికి వేదాలు ముఖ్యమైన ఆధారం. ధర్మానికి సంబంధించిన అన్ని విషయాలను మనం వేదాల నుండే తెలిసికొనగలం. శ్రీశంకర భగవత్పాదులు ఇలా చెప్పారు :

**వేదస్య హి ధర్మాధర్మయోః నిరపేక్షం ప్రామాణ్యం రవేరిన రూపవిషమే.**

ధర్మం యొక్క స్వరూపాన్ని నిర్ధారించటానికి ఎదురులేని, అసామాన్యమైన అధికారమున్నది. ఒక వస్తువును స్పష్టంగా చూడాలంటే సూర్యకాంతి అవసరం. వేరే కృత్రిమకాంతి అవసరం లేదు. వేదాల అధికారము అటువంటిదే. ఆ అధికారాన్ని మరెవ్వరూ స్వీకరించకూడదు. ధర్మం గుర్చి ఎవరికి వారు తమకు తోచిన వివరణను వ్యాఖ్యానాన్ని ఇవ్వటం ప్రారంభిస్తే చాలా ప్రమాదకరం. దానివలన సందిగ్ధమైన పరిస్థితులు ఏర్పడటమే కాదు, ధర్మమంటే ఏమిటో అర్థం చేసికొనలేము. అనుసరించలేదు. ధర్మసూత్రాలను ఆచరణలో పెట్టలేము. మొత్తంమీద అంతా గందరగోళ స్థితి, విరోధాభాసం. అందుకనే శ్రీ శంకర భగవత్పాదులు ఇలా హెచ్చరించారు.

**కశ్చిత్ కృపాలుః ప్రాణినాం దుఃఖబహులః సంసార ఏవ మా భూదితి కల్పయేత్,**
**అన్యో వా వ్యసనీ ముక్తానామపి పునరుత్పత్తిం కల్పయేత్**
**తస్మాత్ యస్మై యస్మై యద్యద్ రోచతే తత్ సర్వమపి ప్రమాణం స్యాత్**

అటువంటి పరిస్థితియే కనుక వస్తే దేశం నాశనమైపోయే దుస్థితి ఏర్పడుతుంది. కాబట్టి ఎవరూ తమ హద్దులను దాటకూడదు, వేదాల అధికారాన్ని ప్రశ్నించకూడదు.

ఈ ప్రపంచం సుభిక్షంగా ఉండాలంటే ధర్మాన్ని అనుసరించాలి. ధర్మమొక్కటే అందరికీ క్షేమాన్ని అందించగలదు. ధర్మానుష్ఠానం లేనిచోట ప్రజలు క్షేమంగా ఉండరు. సుభిక్షంగా ఉండరు. అందుకనే ధర్మం మన జీవితంలో అత్యంత అపేక్షణీయం.

ధర్మాచరణ ద్వారానే మన జీవితాలలో సుఖసంతోషాలు లభిస్తాయి. వేదాలలో ఆదేశించిన నియమాలే ధర్మంగా పరిగణించాలి. వేరే ఏదీ కాదు.

ఏది ధర్మమో, ఏది అధర్మమో నిర్ణయించే ఏకైక ప్రమాణం వేదం. ఒక వ్యక్తికి ఎంతటి పండితుడైనా, ధర్మాధర్మాలను నిర్ణయించే హక్కు లేదు. అధికారం లేదు. అది సనాతన ధర్మ మౌలిక తత్త్వం. బుద్ధి అపరిమితమైనదనే విషయాన్ని మనం అంగీకరించాలి. ఒక వ్యక్తిని తెలివైనవాడు బుద్ధిమంతుడు చదువుకున్నవాడు అని మనం అంగీకరిస్తే కొంత కాలం తరువాత అతనికంటె తెలివైనవాడు, బుద్ధిమంతుడు, చదువుకున్నవాడు రావచ్చు. అప్పుడు అతని అభిప్రాయాలు మొదటి వ్యక్తి అభిప్రాయాలకు భిన్నమైనవి కావచ్చు. రెండవ వ్యక్తి అభిప్రాయాలను తుదివిగా మనం స్వీకరించలేవు. మరికొంత కాలానికి మరో వ్యక్తి మరింత తెలివితో తన అభిప్రాయాలను వెలిబుచ్చవచ్చు. ఇలా అభిప్రాయాలు మారుతూ ఉంటాయి. దీనికి అంతే లేదు. అప్పుడు గందరగోళ పరిస్థితి. ఎవరి అభిప్రాయాలను స్వీకరించాలో తెలియని పరిస్థితి. ఈ విషయాన్ని గ్రహించే మన ఋషి పుంగవులు వేదములే ధర్మాక విషయాలలో పరమ ప్రమాణం అని చెప్పారు.


**వేదోஉఖిలో ధర్మమూలం స్మృతిశీలే చ తద్విదామ్**

అందువలననే వేదాలే ధర్మానికి మూలం. ధర్మానికి ఏకైక ప్రమాణం. వేదాలను అనుసరిస్తూ వేద ఉపదేశాల కనుగుణంగా సంకలనం చేయబడిన స్మృతులను కూడ ధర్మసూక్ష్మాలను గురించి తెలిసికొనటానికి పరిశీలించవచ్చును.


కాబట్టి ధర్మం విషయంలో వేదమే పరమ ప్రమాణం అని భావించాలి. తరువాత స్మృతులను కూడా పరిగణనలోకి తీసుకొనవచ్చును.

ధర్మాన్ని అనుసరించటం, ఆచరించటం మాత్రం తప్పనిసరిగా జరగాలి. ●

## ఇది చాలా అరుదైన ఫోటో! చెప్పకోగలరా?



ఇలాంటి మరొక ఫోటో ఉండదేమో. ప్రముఖ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి తనయుడు, ప్రముఖ చిత్రకారుడు బుజ్జాయి మద్రాసులో రోడ్డుమీద నడుస్తున్నారు. అప్పటికి మనకింకా స్వాతంత్ర్యం రాలేదు. ఆయన పక్కన శాస్త్రిగారి సహచరులు, అరవింద్‌ఘోష్ శిష్యులూ ఉల్లి తిరుపతిగారున్నారు. అప్పుడు బుజ్జాయి వయసు 16. పక్కనుంచి ఒక కారు వెళ్లింది. అందులో సర్వేపల్లి రాధాకృష్ణన్ గారున్నారు. తిరుపతిగారు ఆయనకి తెలుసు. ఆయన్ని చూసి కారాపి, ఇద్దరినీ ఎక్కించుకుని ఇప్పుడు ఎడ్వర్డ్ ఇలియట్స్ రోడ్‌లో ఉన్న 'గిరిజ' అనే తన ఇంటికి తీసుకొచ్చారు. అప్పుడాయన ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్. మాటల్లో బుజ్జాయిని తిరుపతిగారు పరిచయం చేసి "ఇతను మంచి చిత్రకారుడు', ఉన్నపాటునే బొమ్మ వేస్తాడు" అన్నారు. రాధాకృష్ణన్ గారు ఒక కాగితం ఇచ్చి, ఆయన ముందు కూర్చున్నారు; అప్పుడు వేసిన చిత్రం దానిమీద ఆయన తెలుగులో 'రాధాకృష్ణయ్య' చేసిన సంతకం అంటూ, బహుశా ఎక్కడా చేసి ఉండరేమో. తర్వాత ఆయన భారత రాష్ట్రపతి కావడం, మరో పదేళ్ల తర్వాత, రాధాక్రిష్ణయ్య మనుమరాలు – పేరు గిరిజ – ఆమె కూతురు బుజ్జాయిగారి కోడలయింది. బుజ్జాయిగారు 'మా నాన్న–నేను' అనే తన జ్ఞాపకాలతో ఓ పుస్తకాన్ని ప్రచురించారు. అందులోని ఫోటో ఇది.



# జ్ఞానపీఠ ప్రదానం అందుకున్న తెలుగు కవి!

## సెప్టెంబరు 10 విశ్వనాథ వారి జయంతి!

ఆయన సాహితీ రంగంలో సామ్రాట్ ! జ్ఞాని! ఆంధ్రులకూ, ఆంధ్ర సాహిత్యానికీ జ్ఞానపీఠం అవార్డు తెచ్చిన తొలికవి.

తిరుపతి వేంకట కవులు శిష్యుడు. నా వంటి శిష్యులు ఉండటం వల్లనే గురువుల గౌరవం పెంపు వహిస్తుందన్న ఘనాపాటి శిష్యుడు.

విశ్వనాథకు మీసాలు లేవు– కానీ ఆయన రెండు బుగ్గలూ సంస్కృతాంధ్ర సామ్రాజ్య సామ్రాటత్వానికి ప్రతీకలు.

ఆయన వ్రాసిన రామాయణ కల్పవృక్షంతో ఆయన మరో వాల్మీకి అయ్యారు. విశ్వనాథ వారి 'వేయిపడగలు' వారికి కీర్తికిరీటం తెచ్చి పెట్టింది. ఆయన కవిత్వంలో 'విగరు' ఉంది; ఆయన మాటల్లో 'వగరు' ఉంది.

ఒక్కడే ఒక్కడు విశ్వనాథ. ఆయననుకరించడమూ కష్టమే! ఆయనలా రచించడమూ కష్టమే!

1895 సం॥ము సెప్టెంబర్ 10న కృష్ణాజిల్లా నందనూరులో పుట్టారు. కృష్ణానదీ తీరం విజయవాడనే తన వాసస్థలం చేసుకున్నారు. అక్కణ్ణుంచే ఎన్నో రచనలు చేసారు. అక్కణ్ణుంచే సాహిత్యసభలకూ, సత్కార సభలకూ వెళ్ళారు.

ఆయనొక ఒక విశ్వవిద్యాలయం. మన సంప్రదాయాలు కట్టుబాట్లు చెదరరాదని గస్తీ తిరిగిన యుద్ధనౌక!

ప్రగాఢ ప్రతిభాశాలి. ధిషణాంకారి. ఆంధ్ర సాహిత్య క్షేత్రంలో విశ్వనాథ సత్యనారాయణ చేయని సేద్యం లేదు. పండించని పంట లేదు. తెలుగుజాతిపట్ల విశ్వనాథకు అలవిమాలిన ఆపేక్ష. ఉత్తరాదిన పుట్టి పెరిగిన రాముడు, విశ్వనాథ ప్రాపకంలోతెలుగురాముడు అయినాడు. నా రాముడని తనివితీరా కలవరించి పలవరించారు. విశ్వనాథకున్న అనుచర వర్గం, శిష్యవర్గం మరొకరికి లేరు. ఇష్టులు, అయిష్టులు కలిసి విశ్వనాథను నాడు చేడూ కూడా సజీవంగా ఉంచుతూ వస్తున్నారు. సెప్టెంబర్ 10 ఆయన జయంతి. ఆసందర్భంగా ఈ 'వివరణాసమయం'.

సాహిత్యం, సంస్కృతి అవిభాజ్యమని, వాటి ఉద్ధరణ కూడా ఏకబిగిని జరగాలని విశ్వనాథ శ్వాసా విశ్వాసం. మన దేశ రాజకీయ రంగంలో పండిత మదన్‌మోహన మాలవ్యా గారెలాంటివారో, సాహిత్యరంగంలో విశ్వనాథ సత్యనారాయణ అలాంటి వారు. ఎన్ని ఎదురుదాడులు తగిలినా, తాను నమ్మిన సిద్ధాంతములను వీడలేదు. తన మతం మార్చుకోలేదు. అందుకే ఆయనొక యుద్ధనౌక.

ఒక మహాశిల్పి. గొప్ప ఆలయాన్ని నిర్మించ సంకల్పించాడు. ఏడు ప్రాకారాలు, గాలిగోపురం, ముఖమండపాలు, సింహద్వారాలు, మహాగోపురం, కోవెలకొలను, చుట్టూ మెట్లు... యింకా ఎన్నో కలిస్తే ఆలయం అవుతుంది. ఆ సాహిత్య బృహత్కార్యాన్ని చేస్తూ మధ్య మధ్య ఆ శిల్పి కొన్ని చెక్కుళ్లతో శిల్పాలు రూపొందిస్తాడు. విశ్వనాథ ఆ సాహితీ చెక్కిళ్ళు చేసారు.

విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షం మహాలయం. సమాంతరంగా వారు వెలువరించిన ఖండకావ్యాలు, లఘుకావ్యాలు, నవలలు, నాటకాలు, గీతాలు, ప్రసంగ వాక్యాలు కల్పవృక్షంతో పాటు పెరిగిన పొగడలు, పొన్నలు, పున్నాగాలు.

వి॥స॥నా బాగానే రాస్తారు గానీ ఒక పట్టాన అర్థం కాదనేవారున్నారు. 'పాషాణపాక ప్రభువు' అన్నారు.


మీ కల్పవృక్షం ప్రేరణలో విషవృక్షం మొలిచిందండీ అంటే "ఔనౌను, ఎవరి మార్గం వారిది. నేను వెర్రివాడిని. నాకు ఏడు జన్మలకు గాని ముక్తి లేదు. వారిది వైరిమార్గం. జయ విజయులు చూపిన దారి. మూడు జన్మలకే ముక్తి!" అనేవారు, అలవాటుగా ఉండే ఘాటు థూ...థూల మధ్య.

వందేళ్ళ తెలుగు జీవితాన్ని అద్భుతంగా చిత్రించి, వేయి పడగలు నవల తెలుగుజాతి స్వీయకథ అనిపించారు. సాంప్రదాయ జీవన మార్గం పట్ల విశ్వనాథకు ప్రగాఢ గౌరవం, తిరుగులేని విశ్వాసం ఉన్నాయి. విశ్వనాథ ఏకవీర నవల తెలుగు కాల్పనిక సాహిత్యంలో విలక్షణమైనది. మధురై దగ్గరి వైగై నది చుట్టూ కథ తిరిగి, చివరకు వైగై నది లోనే ముగుస్తుంది. శృంగార భావాలు మధురమైన కోరికలుఎంతటి విశృంఖలమైనవి అయినా, హద్దు మీరకుండా నిగ్రహించుకోవడమే భారతీయ సంప్రదాయమని ఏకవీర తీర్మానిస్తుంది. విశ్వనాథ చెలియలికట్ట నవల మరో కడలి తరంగం. అప్పట్లో 'ఫ్రీ లవ్ సొసైటీ' పేరుతో ఒక సమాజం తెరమీదకు వచ్చింది. ఆ వెర్రితలని దృష్టిలో పెట్టుకుని చెలియలి కట్ట రచించారు. ఇది కేవలం సాంఘిక నవల మాత్రమే కాదు, మానసిక పరిణామ దశలను విశ్లేషించిన ఒక సూత్ర గ్రంథం. చెలియలికట్ట చలం మైదానం నవలకి కౌంటర్‌గా రాశారని కొందరంటారు. కాని అది సరికాదు. బరి తెగించిపోతున్న నైతిక సూత్రాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చెలియలి కట్ట, నవలల్లో యదార్థ జీవన చిత్రణ చేసే సంప్రదాయాన్ని విరివిగా విశ్వనాథ రాశారు.

వేయి పడగలు నవలలో చాలా పాత్రలకు మాతృకలు ఉన్నాయి. తెరరాజు నవల మంజులూరి కృష్ణారావు జీవితం. ఆయన గొప్ప నటుడు. విశ్వనాథ కొంతకాలం కరీంనగరం కథాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అక్కడ లాయర్ వృత్తిలో ఉంటూ సంగీతాన్ని ఉపాసించే గాయక సార్వభౌముడు నారాయణరావు ఉన్నారు. కరీంనగర్ పనిసరాలలోనే మ్రోయు తుమ్మెద అనే వాగు ఉంది. నిరంతరం

## భోజన ప్రియులు

విశ్వనాథ మంచి భోజనప్రియులు. ఆయన రుచులు వింతగా ఉండేవి. తీవ్రస్థాయిలో ఆవకాయ కలుపుకుని, ఆ ముద్ద తింటూ పచ్చిమిరపకాయ కొరుక్కునేవారు. అదీ ఆంధ్ర పౌరుష భోజన చిహ్నం.



## ఉపమా విశ్వనాథస్య

విశ్వనాథ ఉపమానాలు ప్రత్యేకంగా ఉంటాయి. ఇంతకుముందు ఎక్కడా మనకు కనిపించవు. తర్వాత కనిపించడం లేదు. కారణమేమంటే విశ్వనాథ చూపు వేరు.

* ఆమె మంచముపై పరున్న గోధుమవన్నె త్రాచువలెనున్నది.
* ఒంటినుండ మసి పూసికొనిన దొంగవలె సంజ చీకటి తొంగి చూచినది.
* జొన్న చేలలో మంచెగాని సౌధము.
* ఆమె వదనము పావురాయి పొట్టవలె మృదువుగా తళతళలాడుచున్నది.
* ఆమె కంకె విడిచి మురువు వొలుకు పంటచేను.
* ఆ సువాసనల చేత దీపం ఆరిపోవునేమోనని భయపడితిని.
* ఇంద్ర ధనుసు ముక్క పులి తోకలా ఆకాశంలో కనిపిస్తోంది.
* శరదృతువులో కొంగలబారు ఎగురుతుంటే, ఆకాశమనే పాముల చిన్నదాని మెడలోని నత్తగుల్లల పేరులా వుంది.
* గుమ్మడి పువ్వులో కులికే మంచు బిందువు, తట్టలో కూర్చుండబెట్టిన నవవధువులా తోచింది.
* గుండెలపై బోర్లించి పెట్టిన పుస్తకము వలె పసివాడు పడుకున్నాడు.


లయాత్మకంగా ధ్వనిస్తూ ప్రవహించే సంగీత వాగు అది. ఆ వాగు పేరుతో ఆ సంగీత సార్వభౌముని జీవితాన్ని సాక్షాత్కరింపజేశారు. విశ్వనాథ నవలలన్నింటినీ ఒక లక్ష్యంతో ఒక ప్రయోజనంతో రాశారు. వాటిని చాలామంది ఆ విధంగా అర్థం చేసుకోలేదని విశ్వనాథ ఆవేదన పడేవారు. విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు, దమయంతి స్వయంవరం వీటిలో విశ్వనాథ వ్యంగ్య వైభవపు అంచులు చూడొచ్చు. బద్దన్న సేనాని, వీరవల్లడు వీటిదొక తీరు. మా బాబు, జేబుదొంగలు మరొక తీరు. తర్వాత్తర్వాత ఎమెస్కో పాకెట్ బుక్స్‌గా రాసిన కాశ్మీర పట్టమహిషి, చిట్లీ చిట్లని గాజులు, దిండు కింద పోకచెక్క, దంతపు దువ్వెన లాంటి కాశ్మీర కథల పరంపర వేరొక తీరు.

విశ్వనాథ ఖండ కావ్యాలురాసినా, వచనం రాసినా, లఘుకావ్యాలు రాసినా కండపుష్టి గల రచనలే చేశారు. తన ప్రతిభను గ్రంథాలలోకి దించి, జాతికి అందించిన మహానుభావుడు. సనాతన భారతీయ తత్వాన్ని త్రికరణ శుద్ధిగా నమ్మిన జ్ఞాని. విశ్వనాథ రచనలలో 'జీవుడివేదన' అనే మాట తరచూ వినిపిస్తుంది. ఇది ఆయన స్వేచ్ఛాచింతనకు ఒక ఉదాహరణ. ప్రతి మనిషికీ కొన్ని తనవైన ఆలోచనలు ఉంటాయి. సొంత ఘోష ఒకటి ఉంటుంది. దీనిని విశ్లేషించి, సమగ్రంగా పరిశోధిస్తే ఒక విస్మృత తాత్విక సిద్ధాంతం ఆవిష్కృతమవుతుంది. విశ్వనాథ నాటకాలలో వేనరాజు, నర్తనశాల, అనార్కలి ప్రసిద్ధమైనవి. ప్రాచీన కవుల రచనలపై విశ్వనాథ విశ్లేషణ వ్యాసాలు నేటి విమర్శలకు పాఠ్యగ్రంథాలు. ఏ కవిని ఎక్కడ ఎలా దర్శించాలో ఆయనకు తెలుసు. 'మెంతి మజ్జిగ రుచి మెంతి మజ్జిగదే. పరవాన్నం రుచి పరవాన్నందే! బాగుండడమంటే వీటి జీవలక్షణాలను బట్టి తేల్చాలి'... ఇలాంటి కొలత బద్దలతో విశ్వనాథ విమర్శ సాగుతుంది. సాహిత్యంలో ఉన్న శాఖలన్నీ విశ్వనాథకు ఆటపట్లు. కోకిలమ్మ పెండ్లి, కిన్నెరసాని పాటలు, ఉయ్యాల తాళ్లు లాంటి గేయవాక్యాలు, విశ్వనాథ మధ్యాక్కరలు. వేటికవే ప్రత్యేకం.

1895 సెప్టెంబర్ 10న కృష్ణా జిల్లా నందమూరులో జన్మించిన విశ్వనాథ కార్యక్షేత్రాన్ని కడదాకా బెజవాడనే చేసుకున్నారు. విశ్వనాథకు సాహిత్యంలోనే కాదు, జీవితంలోనూ ముందుచూపు ఉంది. తన పుస్తకాలు కనుమరుగు కాకుండా కొత్త తరాల వారికి లభిస్తూ ఉండాలంటే, స్వయంగా ఒక ప్రచురణ సంస్థని స్థాపించి ముద్రించాలని. 'విశ్వనాథ సత్యనారాయణ అండ్ కో' ని ప్రారంభించారు. ఆయన రచనలన్నీ అప్పటికీ ఇప్పటికీ ఆ సంస్థ పేరు మీదే వెలువడుతున్నాయి. విశ్వనాథ సహస్ర మాసోపజీవి. పొందతగిన అన్ని గౌరవాలూ పొందారు. తీసుకోవలసిన అన్ని బిరుదులూ తీసుకున్నారు. ఆనాటి ప్రముఖులు పి.వి.నరసింహారావు, తెన్నేటి విశ్వనాథం, టంగుటూరి ప్రకాశం, బెజవాడ గోపాలరెడ్డి, కళా వెంకటరావు, మండలి కృష్ణారావు ఆయన శిష్యవర్గంలోని వారు. విశ్వనాథ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులుగా, శాసనమండలి సభ్యులుగా తమ సేవలు అందించారు. జాతీయోద్యమం నేపథ్యంలో తన మొదటి నవల 'అంతరాత్మ' ని ప్రారంభించారు గాని, అది అసంపూర్ణంగానే మిగిలింది. ప్రచురితమైన తొలి నవల ఏకవీర. విశ్వనాథ మంచి భోజనప్రియులు. ఆయన రుచులు వింతగా ఉండేవి.

## విశ్వనాథ వేదన

**జీ**వితాన్ని సంపూర్ణంగా తరచి చూసిన వాడు, అర్థం చేసుకున్నవాడు విశ్వనాథ. హాలాహలం ఎలాంటిదోతెలుసు. అమృతమేమిటో తెలుసు. "బాల్యంలో తల్లిని, యవ్వనంలో భార్యని, వృద్ధాప్యంలో కొడుకుని పోగొట్టుకున్నవాణ్ణి. వేదనకి అర్థం నాకు తెలిసినంతగా మరెవరికి తెలుస్తుంది" అన్నారొకచోట. విన్నవారికి కనులు చెమర్చాయి. నూత్న యవ్వనంలో అంటే ఇరవై రెండేళ్ళ వయసులో విశ్వనాథ రాసిన పద్యాలలో ఓ పద్యం :



**నా కనుల యెట్టయెదుటన నా జనకుని**
**నా జనని కుత్తుకలను కోసి నన్నెడిగెన**
**తండ్రు "నే దయాంబుధిని కాదా" యటంచు**
**ఓ ప్రభూ! యదుగువంటి నే నొదిగి యుండి**
**నా కనుల యెట్టయెదుటన నా లతాంగి**
**ప్రాణములు నిల్వునందీసి యడిగెనను న**
**తండు "నే దయాంబుధిని కాదా" యటంచు**
**ఓ ప్రభూ!యదగునంటి నేనొదిగి యొదిగి**
**తనుజు కుత్తుక నులిమి తానను నడిగెన**
**తండు "నే దయాంబుధిని కాదా" యటంచు**
**ఓ ప్రభూ! యదుగునంటి నేనొదిగి పోయి.**

అతి సామాన్యమైన, సార్వజనీనమైన విషయాన్ని చెప్పి, కనిపించని దేవుణ్ని ప్రశ్నార్థకం చేశారు. ఇది ఎన్ని సార్లు చదివినా మనసు ఆర్ద్రమవుతుంది. ఒక దిగులు, ఒక అశక్తత ఆవరిస్తుంది. విశ్వనాథ మాన్య సామాన్యుడు. ఆయన ఆలోచనలు అసామాన్యాలు. ఈ పదఃపాదాలు శరణాగతికి పరాకాష్ట.

తీవ్రస్థాయిలో ఆవకాయ కలుపుకుని, ఆ ముద్ద తింటూ పచ్చిమిరపకాయ కొరుక్కునేవారు. అదీ ఆంధ్రపౌరుష భోజన చిహ్నం! విశ్వనాథ సమకాలికులెవరూ సామాన్యులు కారు. చెళ్లపిళ్లవారు విద్య నేర్పిన గురువులు. అప్పుడప్పుడే రకరకాల ఇజాలు రెక్క విప్పుతున్న రోజుల్లో, విశ్వనాథ ఒంటరిపోరుకి తలపడ్డారు. తలపడి నిలిచారు. నిలిచి గెలిచారు. శతాధిక గ్రంథకర్త. ప్రతి గ్రంథం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సమకాలికులు విశ్వనాథని ఒక మెట్టుపైనే కూచోపెట్టి గౌరవించారు. కొందరాయన అభిప్రాయాలతో ఏకీభవించలేక దూరంగా జరిగారు. అభిప్రాయాల గురించి మాట్లాడితే, ఆయనకు చిరాకు. ఒకసారి ప్రసిద్ధ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు, "వారికీ మాకూ అభిప్రాయభేదాలున్నప్పటికీ.." అనేసరికి, వి॥స॥ నా రెచ్చిపోయారు. "సొంత అభిప్రాయాలున్నవారికి భేధాలు గాని, నీకూ నాకూ ఎందుకు? మీరు మార్క్సుని భుజాన వేసుకుని, నేను శంకరాచార్యుని పట్టుకుని వేలాడుతున్నాం. మనకెందుకు అభిప్రాయభేదాలు.." అని వాదన పూర్తి చేశారు. సినిమా లాంటి శక్తివంతమైన మాధ్యమాలతో సంబంధం లేకున్నా, తెలుగునాట ఆబాల వృద్ధులకు విశ్వనాథ పేరు యెరుకే. అంతగా తెలుగువారిని చదివించినవారు లేరు. అంతగా అర్థం కాని వారూ లేరు. విశ్వనాథతో పోల్చదగినవారు విశ్వనాథ మాత్రమే! అందుకే ఒకడు విశ్వనాథ అంటున్నాం. ●


రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై
044 25204046, 26171341

SRI RAJARAJESWARI
JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times*
*Afford is Spotless Reputation*

# ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు 143వ జయంత్యుత్సవం ద్రవిడదేశం, ఆస్కావారు అతివైభవంగా జరిపారు.

## -ప్రకాశంగారి మనుమడు, మనవరాలు, మునిమనవడు, గొటేటిలను సత్కరించారు-




**ద్రవిడ దేశం కృష్ణారావు, తమిళనాడు మంత్రులు శ్రీ చిన్నయ్య, శ్రీ రమణ, గవర్నరు రోశయ్య గోటేటిని సత్కరిస్తుండగా ప్రక్కనున్న ఒంగోలు MLA దామిచెర్ల శ్రీనివాస్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆస్కా అధ్యక్షులు ఆదిశేషయ్య**

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారి 143వ జయంతిని ఒక రోజు ముందుగానే ఆగస్టు 22 శనివారం సాయంత్రం 6 గం॥లకు ద్రవిడదేశం కృష్ణారావుగారూ, ఆంధ్రా సోషల్ అండ్ (ఆస్కా) కల్చరల్ అసోసియేషనువారూ కలిసి 'ఆస్కా'లోని గోదావరీ హాలులో ఘనంగా జరిపారు. హాలు ఆంధ్రాభిమానులతో నిండిపోయింది. ముఖ్యంగా ప్రకాశం జిల్లా ఒంగోల్నుంచీ అభిమానులు యెక్కువగా వచ్చారు. తమిళనాడు గవర్నరూ, సుదీర్ఘ రాజకీయానుభవం పండించుకుని, శాసనసభల్లో ధీరోదాత్తుడైన ప్రతిపక్ష, అధికారపక్ష నాయకునిగా గొంతెత్తిన కొణిజేటి రోశయ్యగారు జ్యోతి వెలిగించి, ముఖ్యాతిథిగా వేదికనలంకరించారు. తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితగారు పంపగా వచ్చిన మంత్రులు బీవి రమణ, టీకేఎం చిన్నయ్య గారలూ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దనరావు ప్రభృతులు వేదికనలంకరించారు. గవర్నరుగారు సభకు వచ్చినపుడు, సభగంటలో జరపాలి. కావున తమిళనాడు మంత్రులు, గవర్నరు రోశయ్యగారు తక్క, మిగతావారందరూ టూకీగానే మాట్లాడారు. వారంతా ఆంధ్రకేసరి మా జిల్లావారని పొగడడం జరిగింది. ద్రవిడదేశం కృష్ణారావుగారు ఒంగోలువాడే! సభలను నిర్వహించడంలో దిట్ట. చెన్నయ్‌లో తెలుగుతనం వెలుగుచూడాలనీ, తెలుగు పాఠశాలల్లో తెలుగును బోధించాలనీ, తెలుగువారు పడుతున్న పాట్లను, సూటీగా, బ్యూటీగా వాక్చాతుర్యంతో సభ సంకల్పింపబడిన ఉద్దేశాన్ని చెప్పారు. ప్రకాశంగారి మనుమడు గోపాలకృష్ణ, మనుమరాలు సరోజ, మునిమనుమడు సంతోష్‌కుమార్, ప్రకాశం పంతులుగారి ప్రజాపత్రికలో పనిచేసిన శ్రీ గోటేటి శ్రీరామారావు (ప్రముఖాంధ్ర)లను సన్మానించడం కూడా ప్రకాశంగారి పట్ల గల భక్తి ప్రకాశమే!

**రాష్ట్ర గవర్నరు రోశయ్య గారు ఆంధ్రకేసరి వీరోచిత అంశాలను స్పృశిస్తే బాగుండేది.**

తమిళనాడు మంత్రి రమణగారు పదే పదే ఆంధ్ర కేసరి యని ముచ్చటిస్తూ ప్రకాశం గారి విశిష్ట, వీరోచిత జీవితాన్ని, త్యాగగుణాలనూ విపులీకరించారు. అందరూ శ్రోతలదృష్టి గవర్నరు కొణిజేటి రోశయ్యగారిపైననే ఉన్నది. ఆయన ఎక్కువసేపు సమయం తీసుకుని మాట్లాడారు. విద్యార్థిదశలో తమకూ ప్రకాశం గారికున్న పరిచయం చెప్పారు. వారు ముఖ్యమంత్రిగా ఉండే రోజుల్లో గుంటూరులోని విద్యార్థులు కోపంతో ఉన్నారనీ, గుంటూరు రావద్దని అధికారులు ప్రకాశంగారికి చెప్పినా, వారు పట్టించుకోకుండా గుంటూరు రైల్వేస్టేషనులో దిగారు. దిగగానే విద్యార్థులు వారిపై రాళ్లు రువ్వారనీ, ప్రకాశం గారికి తగులకుండా పోలీసు డీఎస్పీ, ఇతర అధికారులు వలయంగా నిలిచి వారిని పోలీసువాన్‌లో ఎక్కించి, మకాముకు కాముగా చేర్చారనీ చెబుతూ, – విద్యార్థులు రాళ్లు రువ్వుతారనీ చెప్పినా, వినకుండా ధైర్యంగా వచ్చారని చెప్పారు. ప్రకాశంగారి వీరోచిత జీవితం యెరిగున్న మాకు కొంత ఉత్సాహం కల్గింది. బ్రిటిష్ దొరలకు గుండెనెదురొడ్డి 'కాల్చండిరా' –యని సింహ గర్జన చేసిన ప్రకాశం పంతులు. న్యాయవాదిగా ఉంటూ న్యాయమూర్తులైన తెల్లవారికి ఎదురునిలిచిన ధీరోదాత్త న్యాయవాది, వారల నురుకులూ పరుగులు నెట్టించినవాడు. న్యాయవాదిగా లక్షల కొలదీ ద్రవ్యము నార్జించి, దేశ సేవలోనే ఖర్చుపెట్టినవాడు. మద్రాసు కాంపోజిట్ స్టేటుకు ముఖ్యమంత్రిగాను, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగాను పనిచేసిన ప్రకాశం పంతులు కాలికి చెప్పులు లేకుండా, ధరించే చిరుగు చొక్కాకు తానే చిరుగులు కుట్టుకుని, బొత్తాములు కుట్టుకుని వెళ్ళినవాడూ, జాతిపిత గాంధీగారికీ, తొలి ప్రధాని జవహర్‌లాలులకు తలొగ్గి సలాము చేయని వాడూ, పదవుల కోసం అర్రులు చాచకుండా ప్రజలే నాకు చాల్ను, **ప్రకాశమే ప్రజలు, ప్రజలే ప్రకాశంగా** జీవించిన ఆ ధీరోదాత్తుని గూర్చి చెప్పవలసిన వెన్నో ఉన్నాయ్. దేశంలో చక్రం తిప్పుతున్న కాంగ్రెసు నియంతాధికారాన్ని ధిక్కరించిన ధీరోదాత్తుడు ఆంధ్రకేసరి గూర్చి చెప్పవలసిన వెన్నో ఉన్నాయ్. రోశయ్యగారెందుకు స్పృశించలేదో అర్థం కాలేదు. ఎంతో గొప్పగా 'ఆంధ్రకేసరి' 143వ జయంతి సభనేర్పరచిన వారందరికీ మా జేజేలు. రోశయ్యగారికీ, ఇతర పెద్దలకూ మా శుభాభివందనములు. కృష్ణారావుకు శుభాశీస్సులు. ●

*శోభనాచల వారి చిత్రం - దర్శకత్వ పని చేయడమే తక్క - వేతనపు రాళ్ళెపుడొస్తాయో తెలియకపోయినా - 'లక్ష్మమ్మ' చిత్రంలో లక్ష్మమ్మ పడిన కష్టాలన్నీ పడి, లక్ష్యంతో చిత్రం పూర్తిచేసి విజయకారకుడైన 'గోపీచంద్ జయంతి' సెప్టెంబర్ 8న వస్తూంది!*

# గోరంత దీపాన్ని వెలిగించి కొండంత వెలుగులు నింపాలనుకున్న గోపీచంద్!

# 'లక్ష్మమ్మ' చిత్రం లక్ష చిత్రాల పెట్టు!

ప్రశ్న మాత్రమే మన జీవితాంతం తోడు రాగలదా? ఎక్కడో ఒకచోట సమాధాన పడవలసిన స్థితి తప్పక వస్తుందా? అలా వచ్చే స్థితి సహేతుకమా, నిర్హేతుకమా?

'అసమర్ధుని జీవయాత్ర', 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా', 'పోస్టు చేయని ఉత్తరాలు', 'మాకూ ఉన్నాయి స్వగతాలు', 'తత్వవేత్తలు', 'మెరుపులు మరకలు' వంటి విశిష్ట రచనలు చేసిన గోపీచంద్ రచనా ప్రయాణం – నాస్తికత్వంతో మొదలై, మార్క్సిజం, నవ్య మానవతావాదాల్ని దాటుకుని, ఆధ్యాత్మిక చింతన దగ్గర నిలిచిపోయింది.

'సూతాశ్రమం' స్థాపకుడు త్రిపురనేని రామస్వామి చౌదరి ఇంట జన్మించిన గోపీచంద్ – తండ్రి అడుగుజాడల్లో హేతువాదిగా మలచుకున్నాడు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా మసలుకున్నాడు. 'ఎందుకు?' అన్న ప్రశ్న వెంట నడిచాడు.

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, 'శాస్త్రీయ ధోరణి'తో రచనలు గావించాడు. మానసిక విశ్లేషణ చేయడంలో తనకు తానే సాటి అనిపించుకున్నాడు. సిద్ధాంతాల్ని తేలికభాషలో చెప్పే రాజకీయ కథల్ని రాశాడు. మార్క్సిజం ఏమిటో వివరించే ప్రయత్నం చేశాడు. తర్వాత, ఎం.ఎన్.రాయ్ బాటలో నడిచి రాడికల్ హ్యూమనిస్టుగా ఖ్యాతిగాంచాడు. సంఘంలోని హెచ్చుతగ్గులకు భగవంతుణ్ని కారణంగా చెప్పటాన్ని మోసంగా జమకట్టాడు. నీతినియమాలు ప్రకృతిలో నియమనిబద్ధతకు సంబంధించినవన్నాడు. ఏ దృక్పథమైనా మానవుడి పరిణామానికి దోహదం ఇచ్చేదిగా ఉండాలి. అతనిమీద పెత్తనం చలాయించేదిగా ఉండకూడదన్నాడు.

లేని గౌరవాలకు పోయి, ఉన్నదంతా ఊడగొట్టుకుని, లౌకిక ప్రపంచపు విలువల్ని తిరిగి అందుకోవడంలో విఫలమై, అందరిలాంటివాడే అనిపించుకోవడం ఇష్టంలేక తనకు తానే ఒక ద్వీపకల్పంగా తయారై, చేసిన పనిలో ఇమడలేక, ఏ పని చేయాలో, ఎందుకే చేయాలో అర్థంకాక, జీవితానికి ఏ సార్థకతా, పరమార్థమూ కనబడక, తలెక్కడో తోకెక్కడో తెలియని సంఘంతో ఘర్షణపడి, బతికినన్నాళ్లూ ఏదో ఒకరకంగా జీవితంలో పాల్గొనవలసిందేనన్నది మరచిపోయి, పిచ్చివాడిగా ముద్రపడి, బలవన్మరణానికి గురైన 'అసమర్థుడు' సీతారామారావు పాత్రను సృష్టించాడు.

ధనికులు మనిషిగానే జమకట్టని రిక్షావోడి అంతరంగాన్నీ, శరీరం సహకరించని దశలో ఆదరణ కరువైన ముసలి ఎద్దు వేదననీ తన రాతల్లో చిత్రికపట్టాడు. ప్రత్యేకించి తత్త్వశాస్త్రాన్ని అభ్యసించకపోయినా, స్వీయ అధ్యయనం ద్వారా ఎందరో తాత్వికుల ఆలోచనాధారను పరిచయం చేశాడు.

వృత్తిరీత్యా గోపీచంద్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేశాడుగానీ, అందులో నెగ్గలేకపోయాడు. సినిమాల్లోకి ప్రవేశించి 'రైతుబిడ్డ', 'గృహప్రవేశం' వంటి చిత్రాలకు రచన చేశారు. 'లక్ష్మమ్మ' సినిమాకు దర్శకత్వం వహించాడు. ఎంతో ప్రతిభ ఉన్నవాడైనప్పటికీ మద్రాసులో నిలదొక్కుకోలేక, ఆర్థికంగా చితికిపోయిన దశలో పాండిచ్చేరి అరవిందాశ్రమం ఒడిలో వాలిపోయాడు. అరవిందుని దర్శనాన్ని విశ్వసించాడు. కొడుకు సాయిచంద్ ఆరోగ్యం బాగాలేనప్పుడు, సాయిబాబాను నమ్ముకున్నాడు. సామాన్య మానవులు అందుకోలేని కొన్ని స్థాయిల్ని మహర్షులు అందుకోగలిగారనీ, అందువల్ల వారిని ప్రశ్నించకుండా అంగీకరించాలనీ రాశాడు. 'ఎక్కడో ఒకచోట ఈ ఎందుకు? ఆగవలసిందేరా తండ్రుల్లారా' అని సీతారామారావు వ్యాఖ్యానించినట్టుగా... 'ఎందుకు?' అన్న ప్రశ్న నేర్పిన' నాన్న నుంచి పూర్తిగా 'విముక్తుడయ్యాడు'.

గోపీచంద్ జీవితం, ఆ లెక్కన ఏ సాధారణ మానవుడి జీవితం కూడా ఈ 'భ్రమణానికి' మినహాయింపు కాదేమో! పిల్లాడిగా తండ్రినీ, ఇంకా ఆ వయసులో బలమైన ముద్ర వేయగలిగేవారినీ అనుకరించి, అనుసరించి... యౌవనంలో ప్రశ్నను ఆయుధంగా మలుచుకుని, నిర్లక్ష్యం చేస్తున్న ప్రపంచాన్ని తమ మాటలతో ఆకర్షించి... చిట్టచివరకు, అంతకుముందు భిన్నంగా నడిచిన పిల్లపాయ నుంచి తప్పుకుని



ప్రధాన స్రవంతిలో ఏకమైపోవడంతో జీవితం పూర్తవుతుంది! కాకపోతే, అప్పటికి 'ప్రగతిశీలం'గా కనబడే విలువల్లోంచే ఎవరినైనా అంచనా కడతాం.

థియరీని ప్రాక్టికల్‌గా అన్వయించుకోవడంలో విఫలమైతే ఏ వాదానికైనా అర్థం లేదు. అందుకే తను రాసిన వాటిని తనే ధిక్కరించుకునే అవసరం గోపీచంద్‌కు వచ్చిందేమో! మానవ స్వభావపు పరిధిలోనే ఆయన రచనాక్రమం సాగిందేమో! చిట్టచివరికి ఆయన తన అసలు స్వభావానికి చేరుకున్నాడేమో! కాకపోతే ఒక కన్ఫెషనల్ స్టేట్‌మెంట్ ఏమైనా పాఠకులకు బాకీ ఉండిందేమో! 1962లో 52 ఏళ్లకే ఆయన అర్ధాంతంగా మరణించి వుండకపోతే ఆ బాకీ కూడా చెల్లించే వాడేమో! లేదా, ఆయన తిరిగిన ప్రతి మలుపూ ఆయన చేసిన ప్రకటనయేనేమో!

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :



# నవ మృదంగ మాంత్రికుడు

**పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం దగ్గర పాలకోడేరు గ్రామం. సంగీత కుటుంబంలో ఐదవ తరం వారు. తాత తాతముత్తాతలు మృదంగ విద్వాంసులు. తండ్రి రామమూర్తి గాత్ర, వయొలిన్ విద్వాంసులు, పెదనాన్న ఎల్లా సోమన్న సుప్రసిద్ధ మృదంగ విద్వాంసులు. వారిల్లు సంగీతపు హరివిల్లు.**

ఆయన హస్తభూషణం మృదంగం. మృదంగ వాద్యనిపుణుడని గానీ, మృదంగ మాంత్రికుడనీ – సరిపెట్టలేము.

మార్దంగ మాంత్రికుల్లో ధర్మాల రామమూర్తి ఎల్లా సోమన్నలొక్కరొక్కరినే, మృదంగ మహద్విద్వాంసులుగా చెప్పుకుంటాం. ఎల్లా వేంకటేశ్వరరావు గారి విషయానికొచ్చేసరికి నవమృదంగ మాంత్రికుడని చెప్పుకోవాలి. ఒక్క మృదంగాన్ని వాయిస్తూనే – మార్దంగ నిపుణులుగా పేర్కొనవలసిన వారు కొందరే ఉన్నారు.

ఆ కొందర్నీ మించిపోయేట్లు, తొమ్మిది మృదంగాల వాద్యకారునిగా, నవ మృదంగ మాంత్రికునిగా పేరు తెచ్చుకున్న మృదంగ వాద్య విద్వాంసుడు ఎల్లా వేంకటేశ్వరరావు. నా దృష్టిలో వీరు తక్క మరొక్కరున్నట్టు గోచరం కావడంలేదు.

మృదంగ వాద్యం ద్వారా రాగాలను పలికించడంలో కూడా ఎల్లా వేంకటేశ్వర రావు గారినే చెప్పుకోవాలి. వీరి కీర్తి ఆంధ్రదేశపు ఎల్లలు దాటిపోయింది.

ఉభయ గోదావరి జిల్లాల్లోని పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం పట్టణానికి సమీపంలోని పాలకోడేరు వీరి గ్రామం. 'వీరీ వీరీ గుమ్మడిపండు – వీరి పేరేవరూ' యని గేయ ప్రశ్న వేసుకోవాల్సిన అవసరం లేదు. ఎల్లా వారి కుటుంబీకులందరూ మృదుమృదంగ విద్వాంసులే! వీరి పెదనాన్న ఎల్లా సోమన్నగారు ప్రసిద్ధ మార్దంగికులు. వీరి తండ్రి రామమూర్తి గారు వయొలిన్, గాత్ర విద్వాంసులు. అందుకేనేమో – మృదంగంపై వీరి వేళ్ళు రాగాలను పలికిస్తాయ్. వేంకటేశ్వరరావుగారి తాత ముత్తాతలందరూ మృదంగ విద్వాంసులే! వీరిల్లు సంగీత సరస్వతీ నిలయం. అనునిత్యమూ శిష్యవర్గం గాత్ర, వయొలిన్, మృదంగ వాద్యరవళిలు వీనులకు వినిపింపచేస్తూనే ఉంటారు. ఈ మూడూ కలిసినవే సంగీత సభయనాలి. అలాటి సంగీత సభలు వీరింట రోజుకు 16, 20 గంటలు వినిపిస్తూంటాయ్. కునుకు

**వెండి తెరల వ్యామోహాల నుండి వెకిలి చానెళ్ళ వ్యాపార కార్యక్రమాల నుండీ – దృష్టిని తనవైపు ప్రసరింపచేసుకున్న మృదంగ మాంత్రికుడు**

## డా॥ ఎల్లా వేంకటేశ్వరరావు

తీసే వారికి 4 గంటల సమయమే ఉంటుంది.

వేంకటేశ్వరరావు గారి కుటుంబంలా అయిదు తరాలుగా సంగీత సాధనల్ని చేసిన కుటుంబాలు యెక్కడా కనిపించవు. వీరి అన్నప్రాసనం, అక్షరాభ్యాసములు మృదంగంతోనే జరిగాయనడానికి నిదర్శనంగా – పధ్నాల్గవ యేట రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా జాతీయ స్థాయిలో జరిగిన, అఖిల భారత ఆకాశవాణి పోటీలో 'బంగారు వీణ'ను అందుకోవడమే! వీరు 3 మృదంగాలు వాయించిన నేర్పరితనానికి 'డాక్టరేటు' లభించింది. అప్పుడే ఆయన మృదంగంపై రాగాలను పలికించే ప్రయోగం చేసారు. మూడు మృదంగాలు వాయించిన తాను – తొమ్మిది మృదంగాల్ను ఒకేసారి వాయించాలని అభిలషించారు. 1981 సం॥లో హైదరా బాదులో – ఏకధాటీగా 36 గంటల పాటు, నవ మృదంగాలను వాయించి, 'గిన్నీస్ బుక్'లో పేరు సంపాదించారు.

భారతదేశంలోని వివిధ రాష్ట్రాలూ, నగరాల్లోనే గాకుండా, 72 యితర దేశాల్లో మృదంగం సోలో కచ్చేరీలను చేసారు. 2008 సంవత్సరంలో రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా 'పద్మశ్రీ' బిరుదము నందుకున్నారు. దేశంలోని అనేకానేక సంగీత విద్వాంసులు కచ్చేరీల్లో మార్దంగికునిగా పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయంలో 'మృదంగ వాద్య' నిపుణుతల సిలబస్‌ను తయారుచేసారు. సంగీత కళాశాలల్లో థియరీ, ప్రాక్టికల్స్‌కొకే సారి పరీక్షలు ప్రారంభించేట్టు చేసారు.

**మృదంగ విద్వాన్ ధర్మాల రామమూర్తి గారి 'మృదంగ శాస్త్రం' గ్రంథం అచ్చు కావడానికి గోటేటి శ్రీరామారావు కొంత ఆర్థిక సహాయం చేసారు; ఆయనకు నలుగురి సాయం అందేట్లు తోడ్పడ్డారు.**

తెలుగు విశ్వవిద్యాలయం స్థాపన కార్యక్రమ ప్రారంభమున – సంగీత, విశ్వ విద్యాలయంలో – ఆ శాఖాధ్యక్షునిగా చేరారు.

ఇన్నిన్ని కార్యక్రమాలకు రూపురేఖా విలాస కార్యక్రమాలు చేసిన ఎల్లా వేంకటేశ్వరరావు గారు – బడికి వెళ్ళి చదువుకున్నదేమీ లేదు. పాఠశాలకు వెళ్ళినదీ లేదు. చదువుకోవాలనే తపన ఉండేది. 1980 సం॥ము ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఓపెన్ యూనివర్సిటీ ప్రారంభించినప్పుడు ఆయనా, ఆయన భార్య త్రిమూర్తులమ్మా ఇద్దరూ చేరారు. ఆయన భార్య 7వ తరగతియైనా చదువుకున్నదట, ఆయన అదీ చదువుకోలేదు. కొంత కాలానికీ భార్యాభర్తలిరువురూ ఎంట్రెన్స్ వ్రాసి – ఎం.ఏ. ఆయన, భార్య బి.ఏ. పట్టాలందుకున్నారు. అయితే అప్పటికే ఆయనకు జవహర్లాల్ యూనివర్సిటీ డాక్టరేటు యిచ్చింది. కుటుంబ విషయానికి వస్తే – వేంకటేశ్వరరావు గారికి ఇద్దరు కుమారులూ, ఇద్దరు కుమార్తెలు. పెద్దబ్బాయి మంచి మృదంగ విద్వాంసుడు. ఆయన వారసుడైన పెద్దబ్బాయి మృదంగ వాద్యకారునిగా విదేశాలు పర్యటిస్తూ, వాద్య కచ్చేరీలు చేస్తూన్నాడనే సంతోషం ఆయనకు దక్కకుండా 16వ ఏటనే మరణించాడు. అయితే వారి మనవలు మృదంగ వాద్య నిపుణులవుతున్నారు. ఎల్లా మృదంగ అంతర్జాతీయ సంస్థను నెలకొల్పి, మృదంగం నేర్చుకునేవారికి ఉచిత విద్యను ఏర్పాటుచేశారు.

ఇప్పుడు 66 సం॥ము వయసులో ఉన్న ఆయనకు వాయిద్య కచ్చేరీ కరతలామలకంగానే ఉన్నది. ఇలాటి విద్వాంసులు చిరంజీవులు కావాలన్నదే ప్రముఖాంధ్ర ఆశిస్తూన్నది, ఆశీర్వదిస్తున్నది. ●




# ఆయన ఒక్కడు! ఇరవై ఒక్క విద్యా, వైజ్ఞానిక సంస్థలు నెలకొల్పాడు!

# నూటొక్క వసంతముల వయసువాడు! - ఆయనే గోగినేని కనకయ్య -


కొందరి పేర్లకు వారి పనులు నప్పవు! కనకయ్య అంటే కనకయ్యే – అన్నారు విశ్వయోగి విశ్వంజీ! చేతికి అయిదు వేళ్ళున్నట్లు అయిదు సంవత్సరాలుగా మా యిద్దరి మధ్యా అభిమాన గౌరవాలు పెరిగాయ్. గుంటూరు వెడితే విద్యానగర్ మొదటి వీధిలోని గోగినేని గెస్టుహవుసే నా నివాసం. చెన్నయ్ నుంచీ తెనాలి రైలుస్టేషన్లో దిగినా, విజయవాడ రైలు స్టేషన్లో దిగినా – వారి కారు సిద్ధంగా ఉండేది. 101 సం॥ముల వయసు వారిది – 82 సం॥ముల వయసు నాదీ! గెస్టు హవుస్‌లోనే నా మకాము. వీడ్కోలు పలికినప్పుడల్లా పట్టు శాలువా కప్పి. పూలదండ వేసి, నూతన వస్త్రములిచ్చి, పాద నమస్కారముల్జేసి, జాగ్రత్తగా రైలు యెక్కించమని డ్రైవర్ మౌలాలీని పంపడాన్ని ఇప్పటికీ మరువలేను. ఆయన ఆరోగ్యం మందగించి, మంచం పట్టిన తరువాత, చూడడానికి వస్తానంటే వద్దనేవారు. ఆయనకు ముందే చెవుడు. 101 సం॥ము వచ్చుసరికి ఆయన దృష్టి మందగించింది. ప్రస్తుతం స్పృహ కూడా లేదంటున్నారు. విజయవాడ ఆసుపత్రిలోనే ఉన్నారంటున్నారు.

భగవాన్ సత్యసాయి అంకిత భక్తుడు. ఆయన పేరున ఆయన గ్రామం తాడికొండలో 20 ఉచిత విద్యాలయాలను స్థాపించారు. అన్నిటికీ భవాలున్నాయ్. తాడికొండ ప్రధాన వీధిలో ప్రవేశించినది మొదలు చివరివరకూ ఆయన పాఠశాలలే.

విద్వాన్ గోగినేని కనకయ్య స్థాపించిన తాడికొండ సాంస్కృతిక సంస్థలు,

1.శ్రీ భారతీ పుస్తక భాండాగారము, 2. శ్రీ వెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాల (ప–రి), 3. బేసిక్ ట్రైనింగ్ స్కూల్, 4. గోగినేని కనకయ్య వైద్యాలయము, రూరల్ హెల్త్ సెంటర్, గుంటూరు మెడికల్ కాలేజి అనుబంధ సంస్థ, 5. శ్రీ మల్లెల వెంకట సుబ్బయ్య ప్రాథమికోన్నత పాఠశాల, 6. శ్రీ గోగినేని కనకయ్య ఓరియంటల్ డిగ్రీ కళాశాల (ప–రి), 7. భారత్ స్కౌట్స్ & గైడ్సు రీజనల్ క్యాంపింగ్ సెంటర్, 8. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జూనియర్ కళాశాల (ప–రి), 9. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా డిగ్రీ కళాశాల (ప–రి), 10. శ్రీమతి గోగినేని వెంకాయమ్మ, కనకయ్య, మహిళల బాలల గ్రంథాలయం (జిల్లా గ్రంథాలయ సంస్థ అనుబంధము), 11. శ్రీమతి గోగినేని వెంకాయమ్మ – కనకయ్య (ప–రి) బాలికోన్నత పాఠశాల, 12. శ్రీ సత్యసాయి హైస్కూలు (ఇ మీ) 13. శ్రీ రాయపాటి వెంకట రంగారావు రీజనల్ స్కౌట్స్ & గైడ్స్ కల్చరల్ హాల్, 14. శ్రీమతి ఆళ్ళ జానకమ్మ వెంకటరెడ్డి ప్రభుత్వ హోమియో వైద్యశాల, 15. గోగినేని కనకయ్య కళాభారతి, గుంటూరు 16. తెలుగు పండిత శిక్షణా విభాగము, తాడికొండ, 17. గోగినేని కళానికేతన్, గుంటూరు, 18. శ్రీ గోగినేని నాగేశ్వరరావు కళామందిర్ (గో.వా. పాంధీ పార్కు) తాడికొండ, 19. రాయపాటి వెంకట రంగారావు, సీతారామమ్మ, క్రీడా ప్రాంగణము, తాడికొండ, 20. దేవుని రథము మరియు వాహనశాల నిర్మాణము, తాడికొండ, 21. గుంటూరు శ్మశాన వాటికలో కూడా – ఒక చక్కటి విశ్రాంత భవనం కట్టించారు.

"అన్నదానము దానమన వచ్చునే కాని
అన్నంబు జాములో నరిగిపోవు
వస్త్రదానము గూడా భవ్య దానమె కాని
వస్త్రమేడాదిలో పాతదగును
గృహదానమొకెటి యత్కృష్ట దానమె కాని
కొంప కొన్నేండ్లలో కూలిపోవు
భూమి దానము మహా పుణ్యదానమెగాని
భూమి అన్యుల జేరిపోవచ్చు
అతిగిపోక యించుకయేని చిటిగిపోక
కూలిపోకయు నన్యుల పాలుగాక
నిత్యమై నిర్మలంబయి నిశ్చలమయి
ఒప్పుచుండ విద్యాదానమొకటి జగతి"



జ్ఞానము యొక్క గమ్యము ప్రేమయే
సంస్కృతి యొక్క గమ్యము పరిపూర్ణతయే
ప్రజ్ఞయొక్క గమ్యము స్వేచ్ఛయే
విద్యయొక్క గమ్యము శీలమే

విద్య, శీలమూ మూర్తీభవించిన మధురమూర్తి విద్వాన్ గోగినేని కనకయ్య సంపూర్ణ ఆరోగ్యాన్ని పుంజుకోవాలి. 120 సం॥ములు పూర్ణాయుష్కులు కావాలి. అకుంఠిత సేవలు అందచేస్తూన్న ఆయన మనవడు రాయపాటి సాయికృష్ణ మోహన్ పూర్ణాయుష్షుతో వర్ధిల్లాలి. గోగినేనికి సేవలు కొనసాగించాలి. ●



## వాక్ప్రభావం వాగ్విభూషిత్వం అనేవి రెండు! ఈ రెండూ మెండుగా కలవారు బ్రహ్మర్షి 'రఘుపతి వెంకటరత్నం నాయుడు'



ఆయన పూర్ణచంద్రుని వంటి శీతకిరణుడు. తన చల్లని చూపులతో అమృతమును చిందించి, పతితుల నెందరినో పవిత్రమొనర్చిన పావనమూర్తి. కళాశాలలో ప్రధానాచార్యుడు, విశ్వవిద్యాలయమునకు ఉపాధ్యక్షుడు, విద్యార్థులకు కల్పతరువు, దీనులకు ప్రియతమ బంధువు, మానవులలో ప్రేమారాధకుడు, వక్తలలో మహా వక్త. విద్యావేత్తలలో వినుతికెక్కినవాడు. బ్రహ్మమందిరములో బోధకుడు, ఋషులలో బ్రహ్మర్షి! సంస్కర్తలలో దయాసాగరుడు! అకళంక హాస్యప్రియుడు. ఆయన విశుద్ధ వర్తనకు తగిన దుస్తులు ధరించేవాడు. షేర్వాణీ, షర్టు, తలగుడ్డ, మేజోళ్లు, బూట్లూ అన్నీ తెల్లనివే. వయస్సు పండిన తరువాత గిరజాలు, మీసాలు కూడా తెల్లనైనవి.

మచ్చలేని, మాత్సర్యంలేని జీవితం వారిది. ఆంధ్రదేశంలో అన్ని తెగలవారిచేతను ఆదరింపబడిన మహాపురుషుడాయన.

మృదుమధురమైన మనస్సూ, గంభీరమైన వాగ్విన్యాసం, దయాపూరితమైన హృదయం. జీవితాంతం విద్యాప్రచార ధర్మబోధ సంఘ సంస్కరణలే ఆయన ఊపిరి.

వాక్ప్రభావంచేత తన తరం వారిలో ధర్మోత్సాహం పెంపొందించిన పునీత చరిత్రుడు. హరిజనోద్ధరణకు అంకురార్పణ మొనర్చిన సంస్కర్త.

ఆయన నిత్యజీవిత విధానమే మతం. ప్రేమకు, సేవకు ఆయన మారు రూపు.

ఆయనను ప్రభావంతో బందరు పట్టణం ధన్యత చెందింది. ఆంగ్ల విద్యను మథించి, అమృతాన్ని ఆస్వాదించిన అమరమూర్తి.

తాత తండ్రుల ప్రతిభా పౌరుషములు, తల్లిగారి దైవభక్తి ఆయనలో పుణికిపుచ్చుకున్న పుణ్యచరిత్రుడు.

నాయుడుగారు బ్రహ్మమతస్థుడగుట తండ్రిగారి కిష్టం లేదు. బంధువులెల్లరు వ్యతిరేకులైరి. కాని తాను నమ్మిన మతమునను సరించి ముక్తి పొందుట ఆయన ధర్మముగ భావించిరి. ఆయన సహధర్మచారిణి శేషమాంబ ఆయన కష్టముల భాగస్వామిని యగుటయే కాక ఆయనను ప్రోత్సహించెను. సుగుణవంతురాలగు సహధర్మచారిణి సాహచర్యము జీవితాంతము వరకు అనుభవించగల అదృష్టం. నాయుడుగారికి కలుగలేదు. వారికి యిద్దకు కుమార్తెలు కలిగిరి. కాని వారు చిన్నతనముననే మరణించిరి. పుణ్యవతి శేషమాంబగారును స్వర్గస్థులైరి.

తనకు కలిగిన దుఃఖమును దిగమ్రింగిన స్థితప్రజ్ఞుడు. జీవితాంతము బ్రహ్మచర్య వ్రత నిష్ఠాగరిష్ఠుడాయెను. తన చిన్న కుటుంబముననే తన ప్రేమను లగ్నముచేయుట దైవేచ్ఛ కాదని గుర్తించి, విశాల ప్రపంచమునంతను ప్రేమించుట తన ధర్మముగా భావించారు. తాను ఆచార్యుడు విద్యార్థులందరూ తన బిడ్డలేనసే ప్రేమ భావం కలిగిన మహామనిషి.

ఆయనవద్ద చదువుకొన్న విద్యార్థులెల్లరు "ఆచార్యదేవోభవ" అనే ఉపనిషత్తు వాక్యానుసారం ఆయనయెడ భక్తితత్పరతతో, పూజ్య భావముతో వర్తించేవారు.

'విద్యార్థులమీద అంత ప్రభావం కల ఆచార్యుని నేను చూడలేదు' అని నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ క్లార్కుగారు నాయుడుగారిని ప్రశంసించారు.

ఆంధ్రభోజుడుగా ప్రఖ్యాతిగాంచిన పిఠాపురం మహారాజు గారిపై కూడ నాయుడు గారి ప్రభావం అధికం. ఆయన వీరిని గురువుగా భావించేవారు. వీరి సలహా వారికి గుర్వాజ్ఞయే! కాకినాడలోని కళాశాల బ్రహ్మమందిరం, అనాథశరణాలయం మొదలగు యెన్నియో సంస్థలు శ్రీ మహారాజా గారి దానశీలతకు నిదర్శనముగా నేటికీ కనబడుచున్నవి. ఈ కళాశాలలో బాలికలకు, దళితజాతుల విద్యార్థులకు ఉచితంగా విద్య లభించేది.

ఈ ఉచిత విద్యావిధానం నేటికీ మనకు లభించలేదంటే ఆనాటి వారి అభ్యుదయమైన దాతృత్వం ప్రశంసించతగినది. శ్రీ నాయుడుగారి సలహాలు, సాహచర్యం శ్రీ పిఠాపురం వారిని ఆంధ్రభోజుడుగా ప్రఖ్యాతి పొందే అదృష్టవంతులను చేసినవి. ఆ కళాశాలతో తనకు కల సాన్నిహిత్యాన్ని చెప్తూతూ "నా హృదయం అరంగుళం చీల్చి చూడండి. అక్కడ మీకు పిఠాపురం మహారాజా కళాశాల కన్పిస్తుంది" అన్నారు. విద్యార్థులు మానవతాదృక్పథాన్ని స్వతంత్రా లోచనను అలవర్చుకొనుటకు ఆయన విద్యార్థి సంఘాన్ని స్థాపించారు. అదెంతో ప్రఖ్యాతి గాంచినది. ఆయన ఉపాధ్యాయ వృత్తికే ప్రాముఖ్యం, ప్రతిష్ఠ, పవిత్రత తెచ్చారు. విద్యారంగంలో ఆయన కృషి గణనీయమే కాక ఆదర్శప్రాయమైనది.

"విద్యాసంస్థ ఆదర్శం విద్యార్థులను పరీక్షలలో ఉత్తీర్ణులను చేయుటయే కాదు; అక్కడ విద్యార్థికి లభించే ఆదరణ, ఆశ్రయాలకిచ్చే ప్రోత్సాహం, విద్యార్థులపై కలుగజేసే ప్రభావం, యిచ్చే శిక్షణ విద్యాజగతికి నిజమైన గీటురాళ్ళు."

ఇరవయ్యో శతాబ్దం ఉత్తర భాగంలో మనకు లభించిన స్వరాజ్య సిద్ధికి కావలసిన అన్ని హంగులు యేర్పరచుటకు పందొమ్మిదో శతాబ్దం ఉత్తర భాగంలో జన్మించిన కారణజన్ముడాయన. ఆయన పుంభావ సరస్వతి, నిష్కళంక సాధుసత్తముడు ప్రేమమూర్తి. జితేంద్రియుడు, బ్రహ్మజ్ఞాని.

ఆరోజులలో రావు బహద్దర్ బిరుదు నందుకొను సమయమున గాని, సర్ బిరుదును స్వీకరించే వేళకాని, తన ధవళ వస్త్రములను, తలపాగాను మార్చుటకంటే ఆ బిరుదలనే తిరస్కరించగలనని చెప్పిన ఆత్మాభిమాని.

మద్యపాన నిషేధం, అస్పృశ్యతా నివారణ, భోగం మేళముల బహిష్కరణ మొదలగు సాంఘికోద్ధరణ కార్యకలాపాలను మహాత్మునికి అర్థ శతాబ్దం పూర్వమే బోధించి, అనుష్ఠించి, ఆచరింప చేసిన ఆంధ్ర మహాత్ముడు.

మహాత్ముని స్వరాజోద్యమమునకు అనుకూలముగా ఆంధ్ర ప్రజలను తీర్చిదిద్దిన మహా రథికుడు.


మద్రాసు నుండి శ్రీకాకుళం వరకు ఆంధ్రమాగాణముల సేద్యము చేసి ప్రతి సంవత్సరం ముక్కారు పంటలను పండించి అసంఖ్యాకులగు విద్యావేత్తలను ప్రభావింపచేసిన పంటకాపు.

నాయుడుగారు అనాథలనెందరినో చేరదీసి కన్న బిడ్డల వలె ప్రేమించి, పోషించి, పెద్దలను చేసి తన దీనదయాళుత్వమును వరవడిగా, అనుష్ఠించవలసినదిగా శిష్యులకు బోధించారు. ఆయన నెలసరి జీతములో హెచ్చుపాలు బీద విద్యార్థులకు దిక్కు మొక్కులేని అనాథులకు వెచ్చించి ఆనందించేవారు.

తాము తిరుపతి వేంకటకవుల శిష్య ప్రశిష్యులమని చెప్పుకొనునట్లే విద్యావంతులు, విజ్ఞానవేత్తలు, రాజకీయవేత్తలు యెందరో తాము శ్రీ నాయుడు గారి శిష్యులమని సగర్వముగ చెప్పుకొంటారు. **(తరువాయి 12వ పేజీలో)**


బ్రహ్మోత్సవ వ్యాసం!

# భక్త జన 'గోవిందా'!




తిరుమల కొండకు భక్తజన ప్రవాహం ఏడాది పొడవునా సాగుతూనే ఉంటుంది. ఒకప్పుడు వేసవి సెలవుల్లో, బ్రహ్మోత్సవాల సమయంలోనే రద్దీ విపరీతంగా ఉండేది. ఇప్పుడు ఏడాదిలో 12 మాసాలూ రద్దీ కొనసాగుతూనే ఉండడం విశేషం. ప్రస్తుతం తిరుమలకు వాహనాల ద్వారా వచ్చేవారు రోజుకు 50 నుంచి 60 వేల మంది కాగా, అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల ద్వారా 15 నుంచి 20 వేల మంది తిరుమల సందర్శిస్తున్నారు. తిరుమల మొదటి ఘాట్‌రోడ్డు 1944లో ప్రారంభమైనప్పుడు తొలుత 15 బస్సులతో యాత్రికులను తరలించేవారు. 1950లో యాత్రికుల సంఖ్య రెండు వేలకు చేరింది. 1974లో రెండవ ఘాట్ రోడ్డు ప్రారంభమయ్యాక తిరుమలకు వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. 1980లో ఒక్కరోజు యాత్రికుల సంఖ్య 30 వేలకు చేరింది. 1983లో ఎన్టీఆర్ సీఎం అయ్యాక తిరుమలకు పుణ్యక్షేత్రంగా అత్యంత ప్రాధాన్యత చేకూరింది. కాలిబాటలో వచ్చే భక్తులకు టీటీడీ ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో నడిచివచ్చే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. బస్సులు కాకుండా ఇతర వాహనాల్లో 1950లలో పదుల సంఖ్యలోనే భక్తులు వచ్చేవారు. 1980లో ప్రైవేట్ వాహనాల సంఖ్య 500కు చేరింది. 1990లో ఈ సంఖ్య వెయ్యికి చేరింది. 2000లో 1300 కార్లు రాగా 7 వేలమంది, 2010లో 1500 వాహనాలలో పదివేల మంది యాత్రికులు వచ్చేవారు. 2015 నాటికి ప్రైవేటు వాహనాల సంఖ్య 2 వేలకు, యాత్రికుల సంఖ్య 15 వేలకు చేరింది. ప్రస్తుతం తిరుమలకు అన్ని ప్రాంతాల నుంచి 450 ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయి. ఇవి 1600 ట్రిప్పులు, రద్దీ రోజుల్లో 1700 ట్రిప్పులతో జనాన్ని చేరవేస్తున్నాయి. అలిపిరి టోల్‌గేట్‌లో ప్రైవేటు వాహనాలకు ఫీజు రూపేణా లక్ష 80 వేల రూపాయలు జమ అవుతోంది. రద్దీ రోజుల్లో ఈ మొత్తం రెండు లక్షల 20 వేల రూపాయల దాకా ఉంటుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో గరుడ సేవ రోజున రద్దీ ఎప్పటికప్పుడు రికార్డు సృష్టిస్తోంది. 2014లో గరుడసేవకు 1,86,532 మంది భక్తులు తిరుమల సందర్శించారు.

**– ఆంధ్రజ్యోతి, తిరుమల వారికి కృతజ్ఞతలు**




**(11వ పేజీ తరువాయి)**

నాయుడుగారి శిష్యులలో ఒకవిధమగు ఆత్మీయత గోచరిస్తుంది. మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు, తనకు బందరు నాయకత్రయం యెడ కల పెద్దరికమును వెల్లడించుచు, వారు నాయుడుగారి ప్రథమశ్రేణి శిష్యులనియు, తాను చివరి శ్రేణి శిష్యుడననియు, యీ సంబంధము విడరానిదనియు ఆనందంతో ముచ్చటించిన సందర్భములున్నవి. శిష్యులకు నాయుడుగారి యెడ కల ప్రేమ, భక్తి, పూజ్య భావములు అనన్యములు.

నాయుడుగారు పరమపదించినప్పుడు (1939–5–27) కృష్ణా పత్రికలో శ్రీ ముట్నూరి కృష్ణారావు గారు వ్రాసిన "మా నాయుడుగారు" సంపాదకీయంలో.

ఎన్ని ప్రాంతాల్లోనో పెద్దలెందరినో దర్శించాం. కాని నాయుడు గారిని కలుసుకొన్నప్పుడు కలిగిన ఉత్తేజమూ రసానుభవమూ కలుగలేదు. ఈ యుగంలో ఆంధ్ర సీమలో మా నాయుడుగారి వంటి మహాపురుషుడు మరొకరు అవతరించలేదు. అధ్యాపకుడయ్యు ఆప్తమిత్రము, ఆచార్యుడయ్యు అంతరంగ బంధువు. చనువు, భక్తీ, స్నేహం, గౌరవం, నమ్రత, గర్వం, ఏమిటియన గల బాంధవ్యం. ఒళ్ళు మరిపించేసేది భక్తియో, వాత్సల్యమో, సఖ్యమో, ఈ రసానుభవము కనుక ఏదో సంబంధము మమ్ములను అందర్ని ఉత్తేజితుల్ని చేసేది. అది పూజ్యతకు మించింది. అది భయాశ్చర్యాలకు పట్టుగొమ్మ. చూస్తూ చూస్తూండగానే ఏ పుష్పకమో ఎక్కించి అమరవీధుల్లో ఊరేగించేవారు.

"నేటివారు వీరికి శిలావిగ్రహం ప్రతిష్ఠించకపోవచ్చు. ఆంధ్ర విశ్వకళా మందిరంలో వీరి చిత్తరువు కనిపించకపోవచ్చు. కాని అఖండ వైదుష్యమూ, అమృత హృదయమూ, ఈశ్వరభక్తి, దీనజన సేవ, సంస్కారోత్సాహమూ, ఆంధ్ర మహాజనులో ఉన్నంత కాలము నాయుడుగారి దివ్యజీవనము అమరజ్యోతివలె, స్వర్గవాణి వలె తరతరములకూ ప్రబోధకమై వెలయగలదు" అంటూ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు వ్రాసిన వ్యాస సారాంశం. ●

*Compliments from*
**Sri Krishna Bhat**
*When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala*
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

